TGTEL/26/A0372


# మన మహతి న్యూస్

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | శనివారం మే 23, 2026 | సంపుటి : 01 | సంచిక : 114 | పేజీలు 5 | వెల-2/- | MANAMAHATINEWS.COM

# 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

**జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది.**



జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. జూన్ 20 కల్లా ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. పేజి 2లో ▶

# 'వాయుఅస్త్ర' ప్రయోగం విజయవంతం

- స్వదేశీ 'వాయుఅస్త్ర' ప్రయోగం విజయవంతం
- నిబే లిమిటెడ్ రూపొందించిన లాయిటరింగ్ మ్యూనిషన్
- పోఖ్రాన్, జోషిమఠ్‌లో విజయవంతమైన పరీక్షలు
- 100 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించిన 'వాయుఅస్త్ర-1'
- 10 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లే సామర్థ్యం
- లక్ష్యాన్ని టార్గెట్ చేసి మధ్యలోనే విరమించే టెక్నాలజీ
- ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో రాత్రిపూట కచ్చితమైన దాడులు



స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. తాజాగా ప్రైవేట్ రక్షణసంస్థ అయిన నిబే లిమిటెడ్ తన సొంత ఖర్చుతో వాయుఅస్త్ర (ఝఎబా-ార్‌తీు) లాయిటరింగ్ మ్యూనిషన్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. గత నెల 18, 19 తేదీల్లో రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో, ఆ తర్వాత 26, 27 తేదీల్లో ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ వద్ద ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు ఆ కంపెనీ తెలిపింది. పేజి 2లో ▶





# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2లో





## కిడ్నీ మార్పిడి చికిత్సల్లో నిమ్స్ ఘనత

# వైద్య బృందాన్ని అభినందించిన సిఎం రేవంత్

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిడ్నీ మార్పిడి చికిత్సలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ ట్రాన్స్‌ఎ÷-లాంట్స్ పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడిలో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు

# అమరావతిలో అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైంది: మంత్రి అచ్చెన్నాయుడు

- జగన్ పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టిందన్న అచ్చెన్నాయుడు
- చంద్రబాబు సమర్థ నాయకత్వంతో అభివృద్ధి వేగం పెరిగిందని వ్యాఖ్య
- గత రెండేళ్లలో ఊహించని స్థాయిలో అభివృద్ధి జరిగిందని వెల్లడి
- సంక్షేమం, అభివృద్ధిపై జగన్ మాట్లాడలేదని విమర్శ
- దేశానికి చంద్రబాబు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారన్న మంత్రి
- అమరావతి అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైందని వ్యాఖ్య
- వచ్చే ఎన్నికల్లో వైకాపాకు 11 సీట్లు కూడా రావని జోస్యం



2లో

# పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరు?: కేటీఆర్



2లో

- పోక్సో కేసులో సీఎం రేవంత్, బండి సంజయ్ కుమ్మక్కయ్యారన్న కేటీఆర్
- బండి భగీరథ్‌ను కాపాడే ప్రయత్నం జరిగిందని ఆరోపణ
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్
- రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగట్లేదని విమర్శ
- 35 శాతానికి మించి కొనుగోళ్లు జరగలేదన్న కేటీఆర్
- కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్య





# జగన్ మావిగన్ పేరుతో మభ్యపెడుతున్నారు:

- మావిగన్ పేరుతో జగన్ ప్రజలను మభ్యపెడుతున్నారన్న మంత్రి కొల్లు రవీంద్ర
- గత ఐదేళ్లలో అమరావతిని నాశనం చేశారని విమర్శ
- వైకాపా పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టిందని ఆరోపణ
- చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతోందని వ్యాఖ్య
- అభివృద్ధిని చూసి వైకాపా ఓర్వలేకపోతోందని మండిపాటు

2లో

# పాస్టర్ అభినయ్ వ్యవహారం వెనుక ఎవరున్నారో తేలుస్తాం: అనిత



2లో

- పాస్టర్ అభినయ్ వ్యవహారంపై హోంమంత్రి అనిత ఆగ్రహం
- ఘటనపై విచారణ కొనసాగుతోందని వెల్లడి
- కుట్ర లేకపోతే కడప నుంచి అల్లూరికి ఎందుకువచ్చారని ప్రశ్న
- గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని విమర్శ
- అభినయ్ వెనుక ఉన్న వారిని త్వరలో బయటపెడతామన్న అనిత
- కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తామని స్పష్టం
- దాడి, హత్యాయత్నం ప్రచారం కట్టుకథేనని పోలీసుల తేల్చివేత
- కారుపై దాడి సన్నివేశాలు నటింపజేసినట్లు గుర్తింపు

# బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తాం:

- బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఫ్యూచర్‌సిటీ రద్దు చేస్తామన్న హరీశ్‌రావు
- ఫార్మాసిటీకే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని వ్యాఖ్య
- డీవియేషన్ ఉంటే రైతుల భూములు తిరిగి ఇవ్వాలన్న చట్టం ప్రస్తావన
- ఫార్మాసిటీ కొనసాగిస్తామని రేవంత్ సర్కార్ కోర్టుకు చెప్పిందని ఆరోపణ



2లో

## వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు

# ఎదురుదెబ్బ

రాజమహేంద్రవరం: వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సాక్షులను బెదిరించిన కేసులో బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలన్న అనంతబాబు పిటిషన్‌ను కొట్టివేసింది. డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్యకేసులో నలుగురు సాక్షులను అనంతబాబు ప్రలోభపెట్టారు. తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపుతానని బెదిరించారు.



## గోవధ నిషేధం చట్టాల పటిష్ట అమలు - అధికారులు సమన్వయంతో పని చేయండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రభుత్వం పశు సంహారణ శాఖ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించిన అధికారులు!

మన మహతిప్రతినిధి:భ్రమరాంబ

రెడ్డిగూడెం న్యూస్,మే.23




జిల్లాలో గోవధ నిషేధం,జంతు సంక్షేమ చట్టాలను పటిష్టంగా అమలుచేసేందుకు సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

శుక్రవారం రెడ్డిగూడెంలో జరిగిన ప్రత్యేక గ్రీవెన్స్,ఒక నెల ఒక గ్రామం,నాలుగు సందర్శనలు, కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్థక శాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టాల అమలులో రెవెన్యూ, పోలీస్,పశుసంవర్ధక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్రమ రవాణా,చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి,నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బక్రీద్ సందర్భంగా జంతు వధపై చట్టపరంగా చేయదగినవి, చేయకూడని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆవులు,దూడలు,ఒంటెల వధ నిషేధమని,చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

లైసెన్సు లేని వధ శాలలో లేదా అనుమతి లేని ప్రదేశాల్లో పశువులను వధించకూడదని ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్ యాక్ట్-1960.లేదా సంబంధిత నియమ నిబంధనలను ఉల్లంఘించకూడదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎం.హనుమంతరావు,ఆర్డీవో ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నవజాత శిశువుకు ప్రాణం పోసిన 108 సిబ్బంది

ధన్వాడ108 అంబులెన్స్ లో ప్రసవించిన మహిళ సిపిఆర్ టెక్నిక్ సహాయంతో పసిపాప ప్రాణాన్ని రక్షించారు...



మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట.

జిల్లా. మాతా శిశు అంబులెన్స్ లో వెంటిలేటర్ సహాయంతో మహబూబ్నగర్ కు జిల్లా ఆసుపత్రికి తరలింపు

108 సిబ్బందిని అభినందించిన జిల్లా మేనేజర్ సునీల్ కుమార్

నారాయణపేట జిల్లా: ధన్వాడ మండల కేంద్రంలోని జయశ్రీ తన రెండో కాన్పు నిమిత్తం దగ్గరలో ఉన్న ధన్వాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది, అక్కడ వైద్యులు పరీక్షించి తనకు నెలలు నిండకముందే నొప్పులు ఎక్కువ కావడంతో హుటా హుటిన , దగ్గరలో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి 108 అంబులెన్స్ లో రిఫర్ చేశారు, సమాచారం అందుకున్న సిబ్బంది తక్షణమే ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని, నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న మార్గమధ్యలో చిన్న చట్టం దగ్గర మహిళా అంబులెన్స్ లోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది, అప్పుడే పుట్టిన మగ శిశువు పుట్టగానే ఏడవకపోవడం కదలికలు లేకపోవడం గమనించిన ఈఎంటి భరత్ వెంటనే సిపిఆర్ టెక్నిక్స్ సాయంతో ప్రథమ చికిత్స చేస్తూ ఊపిరి పోశాడు, వెంటనే తల్లి బిడ్డను నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు, అక్కడ డాక్టర్ మహేందర్ పరీక్షించి, శిశు పుట్టగానే ఏడవకపోవడం మరియు బరువు తక్కువగా ఉండడం మరియు అత్యవసరం వైద్యం నిమిత్తం కొరకు, నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో ఉండే ఉచిత మాత శిశు 108అంబులెన్స్ లో వెంటిలేటర్ సహాయంతో మహబూబ్నగర్ జిల్లా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించారు, ఈ సందర్భంగా అత్యవసర సమయంలో ఆపద్బాంధవులుగా, అపర సంజీవని లాగా సేవలు చేస్తున్న 108 సిబ్బందిని, ఈఎంటి భరత్ పైలట్ వెంకటేష్ లను జిల్లా ఆస్పత్రి వైద్యులు మరియు పేషెంట్ బంధువులు అభినందించారు

## పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరు?: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పోక్సో కేసు విషయంలో బండి భగీరథ్‌ను కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖు=) ఆరోపించారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రి అంటున్న రేవంత్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. తాము కూడా రాజీనామా చేస్తామన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ధాన్యం కొనుగోళ్లు, బండి భగరథ్ కేసు సహా వివిధ అంశాలపై కేటీఆర్ మాట్లాడారు.

"రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని రైతులే కాదు.. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ధర్నాలు చేస్తున్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనూ రైతులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో 35 శాతానికి మించి ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. ఏ విషయంలోనూ ప్రభుత్వానికి ప్రణాళిక లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు దాదాపు 10 మంది ఉన్నారు. 45 డిగ్రీల ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశమే ప్రధాన అజెండాగా ఉండాలి. ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. పోక్సో కేసులో నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలి. సామాన్యుడైతే పోలీసులు ఊరుకుంటారా? నిందితుడిని నిందితుడిగానే చూడాలి" అని కేటీఆర్ అన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తాం:

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు (ఝుతీఅంష్ట్ర ఝశీ) అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "కేంద్ర పర్యావరణశాఖ ఫార్మాసిటీకే అనుమతిచ్చింది. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉంది. ఫార్మాసిటీ కంటిన్యూ చేస్తున్నామని రేవంత్ సర్కార్ కోర్టుకు చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం డ్రామా చేస్తోంది. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. 75 శాతం ఫార్మాసిటీ.. 25శాతం మిగతావి ఉండాలని చూశాం. ఈ ప్రభుత్వం 75శాతం వ్యాపారం, 25 శాతమే ఫార్మా ఉండేలా చేస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీని రీస్టోర్ చేస్తాం. ఫార్మాసిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రారంభించాం. ఈ ప్రభుత్వం ఏం చేసినా నడవదు.. కోర్టులో నిలబడదు" అని హరీశ్‌రావు అన్నారు.

## 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ౖ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ౖ÷నాన్స్ - ఎ÷-లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలోస్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మరియు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2? గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతంతో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం ?2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం ?4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్,ధాన లక్ష్యాలుగా నిర్దేశిరచుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. హిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

## 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి

**ఏపీలో నాలుగు స్థానాలకు..**

ఏపీ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీ కాలం జూన్ 26న ముగియనుంది. దీంతో ఏపీలోని నాలుగు స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

## 'వాయుఅస్త్ర' ప్రయోగం విజయవంతం

మొదటిపేజీ తరువాయి

లాయిటరింగ్ మ్యూనిషన్ అంటే ఆత్మాహుతి డ్రోన్లు అని అర్థం. మానవరహిత వైమానిక ఆయుధాలైన ఇవి ఆకాశంలో తిరుగుతూ ఉంటాయి. ఏదైనా లక్ష్యాన్ని గుర్తించిన వెంటనే దానిపై విరుచుకుపడతాయి. పోఖ్రాన్‌లో జరిగిన తొలి ప్రయోగంలో 'వాయుఅస్త్ర-1' (ఝుఎబాూర్‌తీఝ-1) దాదాపు 10 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లిందని నిబే లిమిటెడ్ పేర్కొంది. తొలి ప్రయత్నంలోనే 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన లక్ష్యాన్ని ఇది ఛేదించిందని వెల్లడించింది. లక్ష్యాన్ని టార్గెట్ చేసి మధ్యలోనే విరమించుకోవడం లేదా తిరిగి మళ్లీ ఎటాక్ చేసే సామర్థ్యం కూడా దీనికి ఉన్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్ లాయిటరింగ్ మ్యూనిషన్ టెక్నాలజీ ఆధారంగా దీన్ని తయారుచేసినట్లు పేర్కొంది. రాత్రిపూట నిర్వహించిన ప్రయోగంలో తన ఇన్‌ఫ్రారెడ్ కెమెరాను ఉపయోగించి లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించినట్లు తెలిపింది. ఉత్తరాఖండ్ వద్ద నిర్వహించిన పరీక్షలో 'వాయు అస్త్ర-1' 90 నిమిషాలకు పైగా గాల్లోనే తిరుగుతూ.. 14,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న లక్ష్యాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

## ఆస్కార్ స్థాయి నటుడు జగన్

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷-లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

## పాస్టర్ అభినయ్ వ్యవహారం వెనుక ఎవరున్నారో తేలుస్తాం: అనిత

మొదటిపేజీ తరువాయి

విశాఖ: పాస్టర్ అభినయ్ దర్శన్ వ్యవహారంపై ఏపీ హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో విచారణ కొనసాగుతోందని చెప్పారు. కుట్ర లేకపోతే అభినయ్ దర్శన్ కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు. ఆయన గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని విమర్శించారు. అభినయ్ వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారనేది త్వరలో బయటపడుతుందని చెప్పారు. ఆయన్ను కస్టడీకి తీసుకొని విచారణ చేస్తామని తెలిపారు.కడపకు చెందిన అభినయ్ దర్శన్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండల పరిధిలో దాడి, హత్యాయత్నం జరిగాయనే ప్రచారమంతా కట్టుకథేనని ఇటీవల పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీని వెనుక కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వమంతా ఆయనదేనని నిగ్గుతేలింది. తన కారుపై దాడి చేసినట్లు, తనను చంపేందుకు ప్రయత్నించినట్లు కొందరు వ్యక్తులతో అభినయ్ దర్శన్ నటింపజేసి, ఆ దృశ్యాల్ని చిత్రీకరించారు. వాటిని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తిచేసి, తనపై హత్యాయత్నం జరిగిందంటూ అభినయ్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లాలనే కుట్రలో భాగంగా ఈ డ్రామాను రక్తికట్టించారు. పోలీసులు దర్యాప్తు చేయడంతో 24 గంటల్లోనే గుట్టు రట్టైంది.

## అమరావతిలో అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైంది: మంత్రి అచ్చెన్నాయుడు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: వైకాపా పాలనలో జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడం చంద్రబాబుకు సాధ్యం కాదనుకున్నారని, ప్రజల్లో విశ్వాసం పొందలేరని జగన్ భావించారని అన్నారు. ఎవరి ఊహకూ అందని విధంగా చంద్రబాబు సమర్థ నాయకత్వం అందిస్తున్నారని, గత రెండేళ్లుగా ఊహించని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నందునే సంక్షేమం, అభివృద్ధిపై జగన్ మాట్లాడలేదని అన్నారు. రాష్ట్రానికి, దేశానికి చంద్రబాబు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారని చెప్పారు.

"అమరావతిలో అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైంది. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావు. తన తాత, తండ్రి, బాబాయి మరణాలకు చంద్రబాబు కారణమని జగన్ అన్నారు. తాను చేసిన వ్యవహారాలన్నీ చంద్రబాబు చేసినట్టు జగన్ చెప్పారు. ఇలాంటి వ్యక్తులు పుడతారని ముందే గ్రహించి 'అపరిచితుడు' చిత్రం తీశారు. రాజారెడ్డిని చంపినట్టు జగన్ చెబుతున్నారు. రాజారెడ్డిని ఎందుకు చంపారు, ఏవిధంగా చంపారో ప్రజలకు బాగా తెలుసు. జగన్ క్రూరత్వం, వైఎస్ఆర్ అరాచకాలు, రాజారెడ్డి దమనకాండ చాలా మందికి తెలియదు. చర్చ చేపట్టడం ద్వారా జగన్ కుటుంబ నేపథ్యం అందరికీ తెలిసింది. రాజారెడ్డిని చంపిన వ్యక్తులను తాను ఏమీ చేయలేదని జగన్ చెప్పారు. మీ తాత హత్యలో ఉన్నవారిని మీ తండ్రి మిగల్చలేదు. ఆస్తులు ధ్వంసం చేశారు.. బుల్డోజర్లతో ఇళ్లన్నీ కూల్చారు. మిగిలింది పార్థసారధిరెడ్డి మాత్రమే.. ఆయన ఊతకర్రతో నడుస్తున్నారు" అని అచ్చెన్నాయుడు తెలిపారు.

## జగన్ మావిగన్ పేరుతో మభ్యపెడుతున్నారు:

మొదటిపేజీ తరువాయి

పత్తికొండ గ్రామీణం: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో అమరావతిని నాశనం చేయడమే కాకుండా.. ప్రస్తుతం మావిగన్ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం పత్తికొండ తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన వైకాపా.. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. గొడ్డలి పార్టీ నాయకుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తెదేపా శ్రేణులపై ఉందన్నారు.

# సంక్షేమం -- అభివృద్ధి -- మహిళా సాధికారికతకు ప్రభుత్వం అండ.

**•99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ.**

**సంగారెడ్డి, మే 22, మన మహతి న్యూస్ :**
సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారికత, సామాజిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన బాసటగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కంది సమీపంలోని ఎల్.ఎన్. కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కుటుంబ సంక్షేమానికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అవసరమని పేర్కొన్నారు. నైపుణ్య ఆధారిత విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరు ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
రాష్ట్రంలో గత ఏడాది వెయ్యి ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయగా, అందులో జిల్లాలోనే సుమారు 130 పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలను నిర్మిస్తున్నామని వివరించారు.
మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధిగా జీవించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని



రుణాలు అందిస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిర శక్తి మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.
ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు 163 కొత్త చికిత్సలను చేర్చినట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్, ప్రతి 25 కిలోమీటర్లకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 9 వేల నర్సింగ్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు 16 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు.
సనత్‌నగర్‌లో వెయ్యి పడకల టిమ్స్ ఆసుపత్రిని జూన్ నెలలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ఆరు గ్యారంటీలను ప్రజలకు సమర్థవంతంగా అందిస్తోందన్నారు. చెప్పింది చేసి చూపించే ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని తెలిపారు.



జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పారదర్శక పాలన అందించే దిశగా కృషి చేస్తోందన్నారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులను మంత్రి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ పంపిణీ చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.
కార్యక్రమానికి ముందు మంత్రి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి ఆయిల్ ఫామ్ మొక్కలు, డ్రోన్ సాంకేతికత తదితరాలను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సి.డి.సి చైర్మన్ రామ్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీమ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.

**-టీజీ ఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి.**

**సంగారెడ్డి, మే 22,మన మహతి న్యూస్ :**
చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టీజీ ఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధి లోని గొల్లపల్లి, కొండాపూర్ గ్రామాలలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా జొన్నల కు ప్రభుత్వం రూ 2699 మద్దతు ధర కల్పించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్ష పాతి అని, రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను



ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రతి ఒక్కరు తమ ధ్యాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో వ్యవసాయ విస్తరణ అధికారి పంట సాగు ధృవీకరణ,పట్టా పాస్ బుక్ జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు. రైతులు ధాన్యం విక్రయించిన 72 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయాలని సూచించారు. ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి కేంద్రంలో గన్ని బ్యాగులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మెన్ ప్రభు, సొసైటీ చైర్మెన్ లు శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు నర్సింహ రెడి, నర్సింలు, వెంకటేశం గౌడ్, జాకీర్,ప్రభుదాస్ , విఠల్ రెడ్డి, తది తరులు పాల్గొన్నారు.

# లింగాల గ్రామంలో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం - డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యం - గంపలగూడెం పోలీస్

**మన మహతిప్రతినిధి:భ్రమరాంబ**
**గంపలగూడెం న్యూస్,మే.23**
లింగాల గ్రామంలో డ్రగ్స్ పై భారీ అవగాహన కార్యక్రమం
గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా ప్రకటించిన పోలీస్ ఉన్నతాధికారులు
ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గంపలగూడెం మండలం
లింగాల గ్రామంలో సమాజంలో పెను ముప్పుగా మారిన మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా భారీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా లింగాల గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామం గా అధికారులు అధికారికంగా ప్రకటించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పోలీస్ ఉన్నతాధికారులు యువత, విద్యార్థులు మరియు గ్రామస్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలు,వాటి నిర్మూలనలో ప్రజల పాత్రను వివరించారు.
శ్రీ బి.లక్ష్మీనారాయణ డీసీపీ
యువత దేశానికి వెన్నెముక.
డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసలై తమ బంగారు




భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.
ఒక గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా ప్రకటించడం చాలా అభినందనీయం.గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాల సరఫరా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయి.
వై.ప్రసాదరావు ఏసీపీ
మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో ప్రతి ఒక్కరూ గ్రహించాలి.
పిల్లల ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వస్తున్నాయో తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ ఉండాలి.
జి.అనిల్.కె.శశిధర్
లింగాల గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా మార్చడంలో సహకరించిన గ్రామ పెద్దలకు, యువతకు ధన్యవాదాలు తెలిపారు
గ్రామంలో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే గంపలగూడెం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయి అని సందర్భంగా తెలిపారు.
కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అధికారులు మరియు సిబ్బంది
బి.లక్ష్మీనారాయణ డీసీపీ
ఏసిపి,వై.ప్రసాదరావు
జి.అనిల్ గంపలగూడెం ఎస్సై
కె.శశిధర్ పోలీస్ అధికారి
గంపలగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది
ఈ కార్యక్రమంలో గంపలగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది అంతా చురుగ్గా పాల్గొని, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ,శాంతిభద్రతలను పర్యవేక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
వీరితో పాటు గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది భారీ ర్యాలీ లో తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

**•ర్యాలీలో తల్లిదండ్రులకు అవగాహన!**
**•కల్పిస్తున్న డి వై ఈవో శ్యామసుందర్రావు!**

**మన మహతిప్రతినిధి:భ్రమరాంబ**
**తిరువూరు న్యూస్,మే.23**

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో డివిజన్ విద్యాశాఖ అధికారి డివై ఈవో శ్యామసుందర్రావు ఆధ్వర్యంలో బడి పిలుస్తోంది ర్యాలీ బైపాస్ రోడ్డు వినాయకుడు గుడి నుండి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు ర్యాలీ అనంతరం డివిజన్ విద్యాశాఖ అధికారి శ్యాంసుందర్ మాట్లాడుతూ
ఈ సంవత్సరం తిరువూరు డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 500.పైగా మార్కులు సాధించి ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రథమ స్థానంలో ఉంది మా టీచర్స్ మండల గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ




తప్పనిసరిగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి అని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నా డివైఈవో శ్యామసుందర్రావు
ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తుంది ప్రవేటు విద్యాసంస్థలలో సరైన సౌకర్యాలు ఉండవు ఇరుకు గదులు పిల్లలు ఆడుకోవడానికి ఆట గ్రౌండ్లో ఉండవు అధిక ఫీజులు భారం తల్లిదండ్రుల భరించాల్సి వస్తుంది అదే మీరు ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే ప్రభుత్వమే వారు చదువు బాధ్యత తీసుకొని ఒకటో తరగతి నుండి 12.వ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందిస్తుంది తప్పనిసరిగా తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి విద్యావంతులను చేయండి అని





డివై ఈవో తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల హెచ్ఎం రాజు ముష్టికుంట్ల హెచ్ఎం వీరభద్రరావు మరియు టీచర్స్ పాల్గొన్నారు.

# గీతంలో వినూత్న మార్గదర్శన కార్యక్రమం

**•విద్యార్థుల సాధికారతే లక్ష్యంగా ప్రారంభించిన టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ.**




**సంగారెడ్డి,మే 22,మన మహతి న్యూస్ :**
అర్థవంతమైన మార్గదర్శనం, సలహాల ద్వారా విద్యార్థులకు సాధికారత కల్పించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఒక వినూత్న విద్యార్థి మార్గదర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గీతం వృత్తిపరమైన సలహాల కేంద్రంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ దీనికోసం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు తమ విద్య, వృత్తి, వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించుకోవడంలో సహాయ పడటానికి 'టాక్ టైమ్' పేరుతో ఒక ప్రత్యేకమైన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.
ఈ కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ మాథ్యూ 2026 మే 11 నుంచి డిసెంబరు 31 మధ్య కాలంలో, ప్రతిరోజూ సాయంత్రం 4.00 నుంచి 5.30 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు 15 నిమిషాల చొప్పున వ్యక్తిగత సంభాషణకు (నేరుగా మాట్లాడటం) ఆమె అవకాశం కల్పిస్తున్నారు. శని, ఆదివారాలు మినహా, మిగిలిన అన్ని పనిదినాలలో ఈ సెషన్లు అందుబాటులో ఉంటున్నాయి.
నైపుణ్యాభివృద్ధి-పరిశ్రమ సంసిద్ధత, వృత్తి మార్గదర్శనం-మార్గాలు, మార్గదర్శకత్వం-వృత్తిపరమైన అభివృద్ధి, అభిప్రాయాలు-ఆందోళనలకు సంబంధించిన విషయాలను చర్చించడానికి విద్యార్థులకు సౌకర్యవంతమైన, బహిరంగ వేదికను అందించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం విద్యార్థులను తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మార్గనిర్దేశం కోరడానికి, సహాయక వాతావరణంలో నిర్మాణాత్మక సలహాలను పొందడాన్ని ప్రోత్సహిస్తోంది.
ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని డాక్టర్ రోజీనా మాథ్యూ వివరిస్తూ, విద్యార్థులు తమ ఆలోచనలను బహిరంగంగా పంచుకోవడానికి, ముఖ్యమైన నిర్ణయాలపై స్పష్టత పొందడానికి, వ్యక్తపరచడానికి సంకోచించిన ఆలోచనలను చర్చించడానికి, వారి విద్యా, వృత్తిపరమైన ఎదుగుదలను ప్రభావితం చేసే సవాళ్లపై కొత్త దృక్కోణాలను పొందడానికి వీలుగా నిజమైన, అర్థవంతమైన సంభాషణలను సృష్టించడం ఈ టాక్ టైమ్ కార్యక్రమ ఉద్దేశ్యమని చెప్పారు.
స్లాట్ల సంఖ్య పరిమితంగా ఉన్నందున, విద్యార్థులు తమ వంతుగా సమయాన్ని పొందేటప్పుడు స్పష్టమైన చర్చాంశాలతో సిద్ధంగా రావాలని, అవకాశాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, సార్థకమైన సంభాషణను చేయాలని ఆమె స్పష్టీకరించారు.
విద్యార్థులతో తాను పంచుకున్న క్యూఆర్ కోడ్ లేదా వెబ్ లింక్ ద్వారా అపాయింట్ మెంట్లను రిజర్వు చేసుకోవాలని డాక్టర్ రోజీనా సూచించారు.

# సంగారెడ్డి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డిని కలిసిన విద్యార్థి సంఘ నాయకులు

**సంగారెడ్డి, మే 22,మన మహతి న్యూస్ :**




సంగారెడ్డి జిల్లాకు నూతన అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చైతన్య రెడ్డి ను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి భాష ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ సహకారం అందించాలని నాయకులు కోరారు.
జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చైతన్య రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పవన్, నరేష్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లాలో గాలి వాన బీభత్సం.

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

రాత్రి 7 గంటలకు నారాయణపేట పట్టణంలో అతి భారీ ఈదురు గాలులు భయంకరమైన వేగంతో రావడం వల్ల హరిజనవాడ వీధి రోడ్డు పైన ఉన్న వేప చెట్లు ఇండ్లపై పడి అతి భయంకరంగా గోడలు కూలడం జరిగింది ప్రస్తుతం న యాదగిరి రోడ్డు హరిజనవాడ ఇండ్ల దగ్గర పెద్ద పెద్ద వేప చెట్లు ఇండ్ల మీద పడడం వల్ల పక్కన ఉన్న వైర్ల మీద పడడం వల్ల విద్యుత్ కంబాలు చెట్లకు తాకి కేబుల్ తెగిపోవడం జరిగింది రైతు నాయకుడు వెంకోబా, ఆశప్ప దొండ భగవంతు దొండే హనుమంతు, దొండ తిప్పన్న రైతుల ఇంటి పరిసరాల దగ్గర సందర్శించి పక్కనున్న రాజు గారి ఇంటిదగ్గర ఒక పెద్ద చెట్టు ఇంటి మీద పడడం చూసి చెల్లించి పోవడం జరిగింది హరిజనవాడలో దొండే ప్రభు, దొండే తిప్పన ఇంటిపై పెద్ద వేప చెట్టు పడి గోడలు కూలిపోవడం జరిగింది రాత్రి సమయంలో ఎవరూ లేకున్నా సమయంలో పడినందున ఆ ప్రాంతంలో చిన్న పిల్లలు ఆడుకునే స్థలం ఉండడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు గోడలు కూలి చాలా నష్టం జరిగింది ఇట్టి విషయాన్ని నారాయణపేట మున్సిపల్ కమిషనర్ గారికి



మరియు నారాయణపేట మండల తాసిల్దార్ గారి దృష్టికి తీసుకొని వెళ్తామని నష్టం జరిగిన కుటుంబాలకు న్యాయం చేయవలసిందిగా ఆర్థికంగా కోరుతామని రైతుకు భరోసా ఇవ్వడం జరిగినది రైతు సంఘం నాయకులు వార్డు సందర్శన చేసి నష్టపోయిన రైతు కుటుంబాల ఇండ్లకు పర్యవేదించడం జరిగింది నష్టపోయిన ఇండ్లకు నష్టపరిహారం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని



కోరడం జరిగింది అదే విధంగా పక్కనున్న పెట్రోల్ పంపు దగ్గర నిలిచి ఉన్న కాంపౌండ్ లోపల పక్కల ఒక చెట్టు కారుపై పడి కారు అద్దాలు మొత్తం ధ్వంసం కావడం జరిగింది అయ్యపూల రాజుకు, వెంకటేష్ కు చెందిన కారు సంబంధించిన కావడం వల్ల కారులో ఎవ్వరు లేని సమయంలో చెట్టు పడడం జరిగినది యాదగిరి రోడ్ లో ఉన్న బేస్ బాల్ కోర్ట్ గాలికి వడితిప్పడం జరిగింది, ఎన్నో చెట్లు రోడ్లపై పడి ఇబ్బందులు కావడం జరిగింది రైతు నాయకులు ఆకుల వెంకటప్ప పట్టణ అధ్యక్షుడు భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో తంగు విశ్వనాథ్ రెడ్డి, వినయ్ కుమార్, అనిల్ కుమార్,ఎస్ వెంకటేష్, సీతారాంలు. పాల్గొని విపత్తుకు జరిగిన నష్టాన్ని రైతులకు అందించాలి రైతు కుటుంబాలను కాపాడాలని కోరుతున్నారు

# సదాశివపేట పట్టణంలో DCMS ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు.

**సంగారెడ్డి,మే 22,మన మహతి న్యూస్ :**
నిన్ననే జిల్లా కలెక్టర్‌తో సమావేశమై వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రైతులు పంటను మార్కెట్‌కు తీసుకొచ్చి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి దారుణమన్నారు.

సదాశివపేట పరిధిలో మొత్తం 4 వేల 693 ఎకరాల్లో జొన్న పంట సాగు జరిగిందని తెలిపారు. ఒక ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని, కానీ ప్రభుత్వం మాత్రం పరిమిత క్వింటాళ్లనే కొనుగోలు చేస్తోందని విమర్శించారు. కనీసం ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు.

కొండాపూర్ 4 వేల తొమ్మిది వదల 99 ఎకరాలో విస్తీర్ణం లో సాగు చేసినారు ...




ప్రభుత్వం విధించిన పరిమితుల కారణంగా రైతులు బయట మార్కెట్‌లో తక్కువ ధరలకు జొన్నలను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. "పండించేది రైతు... లాభపడేది దళారులా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అకాల వర్షాలు పడితే రైతుల ధాన్యం, జొన్నలు తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే తార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, షెడ్లు వంటి సౌకర్యాలు సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులను డిమాండ్ చేశారు. రైతు చెమట చుక్క వృథా కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

"వాన వచ్చినప్పుడు గొడుగు పట్టినట్టు ఎన్నికల సమయంలో మాత్రమే రైతు గుర్తొస్తున్నాడు" అంటూ ప్రభుత్వంపై ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీ రైతుల తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ၂+××జ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కిసాన్ సంగ్ అధ్యక్షులు నరసింహారెడ్డి, అంజన్న, అక్బర్ హుస్సేన్, చీల మల్లన్న, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి పట్టణ 8వ వార్డు కౌన్సిలర్ సురేష్ గారి భార్య మృతి పట్ల ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

**సంగారెడ్డి, మే 22,మన మహతి న్యూస్ :**
సంగారెడ్డి పట్టణంలోని నారాయణరెడ్డి కాలనీలోని వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



ఈ సందర్భంగా మృతురాలి



ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి , సదాశివపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ కౌన్సిలర్లు దశరథ్ రెడ్డి, జాఫర్, నవీన్, శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

**మన మహతి న్యూస్ ప్రతినిధి.నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.**
క్రిష్ణ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో భీమ్ సేన సేవా సమితి సంఘం ఆధ్వర్యంలో ఎస్ ఐ నవీద్ చలివేంద్ర కేంద్రాన్నిశుక్రవారం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా మండల కేంద్రానికి వచ్చే బాటసారులకు, గ్రామస్తులకు దాహం తీర్చడానికి ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ ఎస్ ఎస్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి గౌడ్, కృష్ణ మండలం పంచాయతీ సెక్రెటరీ నర్సింలు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## కనీవినీ ఎరుగని రీతిలో మక్తల్ పట్టణంలో టౌన్ హాల్ ఏర్పాటుకు చర్యలు.

### హైదరాబాదులో పలు టౌన్ హాల్ లను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి..

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**
మక్తల్ పట్టణంలోని సొంత బజారులో ఏర్పాటు చేయనున్న టౌన్ హాల్ ను... పూర్తిస్థాయి హంగులతో కనివిని ఎరుగని రీతిలో ఏర్పాటు చేసేందుకు మంత్రి వాకిటి శ్రీహరి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.అందులో భాగంగా హైదరాబాదులోని రవీంద్ర భారతి, సంత్ సేవాలాల్ భవన్, ఇతర



భవన్లను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి గారు పరిశీలించారు. మంత్రి వెంబడి పంచాయతీరాజ్ డిఇ ఉపేందర్, ఏఈ అరుణ్ సైతం వెళ్ళగా... ఆయా టౌన్ హాళ్లను పూర్తిస్థాయి కొలతలతో పరిశీలించి వాటికి సంబంధించిన పూర్తి రికార్డులను తెలుసుకున్నారు.మక్తల్ పట్టణంలో సైతం నూతనంగా నిర్మించబోయే టౌన్ హాల్ ను... రవీంద్ర భారతి, సంత్ సేవాలాల్ భవన్ తరహాలో ఎక్కడా రాజీ పడకుండా... అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దేలా మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారు. టౌన్ హాల్ ను అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంచుతూ... అన్ని కార్యక్రమాలు టౌన్ హాల్ లో నిర్వహించేలా పూర్తి సదుపాయాలు అక్కడ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సంతబజార్ లో నిర్మించబోయే టౌన్ హాల్ ను రాష్ట్ర స్థాయి లో తీర్చి దిద్ది, మఖ్తల్ టౌన్ హాల్ ను బెంచ్ మార్క్ గా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. మంత్రి తోపాటు పలు టౌన్ హాల్ లను పరిశీలించిన వారిలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కారి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, మంజూర్ ఇలాహి, ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

## డాక్టర్ ఎంఎస్ఎన్. రెడ్డి ని కలిసిన డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి

**మన మహతి న్యూస్ ప్రతినిధి.**
పాలమూర్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అవార్డు తీసుకున్న శుభ సందర్భముగా హైదరాబాద్, మాదాపూర్ లోని ఎంఎస్ఎన్. గ్రూప్స్ అఫ్ కంపెనీస్ కార్పొరేట్ కార్యాలయంలో డాక్టర్ ఎం. సత్యనారాయణ రెడ్డి (ఎం ఎస్ ఎన్. రెడ్డి) ని కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి అభినందించిన విజన్ ఫార్మా కెమ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి ఈ సందర్భముగా డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి మాట్లాడుతూ పాలమూర్ జిల్లాలోని మారుమూల ప్రాంతం నుండి



వచ్చిన డాక్టర్ ఎమ్ ఎస్ ఎన్ రెడ్డి అన్న అకుంఠిత దీక్షతో ముందుకు వెళ్తూ, తెలంగాణ రాష్ట్రం నుండి ఫార్మా రంగంలో మకుటంలేని మహారాజుగా వెలుగొందుతూ, ఎంతోమంది యువతకి ఆదర్శంగా నిలిచిన డాక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్న నాకు స్ఫూర్తి ప్రదాత అని డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి కొనియాడారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం.

- సదాశివపేట లో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సందర్భంగా టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.

**సంగారెడ్డి, మే 22,మన మహతి న్యూస్ :**
రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం సదాశివపేట పట్టణం లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని అన్నారు. రైతుల కోసం రెండు లక్షల రుణ మాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఇతర పార్టీ ల మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై - అక్రమాలకు సహకరిస్తున్న అధికారులపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళుటకు

- జై భీమ్ సేవాదళం(భారత్) ఆధ్వర్యంలో!
- నిరసన దీక్షకు సిద్ధంగా ఉన్నాం ప్రతి పక్ష పార్టీలు!
- సామాజిక వేత్తలు సంఘీభావానికి సిద్ధంగా ఉండాలని!
- విజ్ఞప్తి చేసిన ప్రతిపక్ష - ప్రజాపక్ష - సామాజిక వేత - మెహర్ బాబా!

**మన మహతిప్రతినిధి:భ్రమరాంబ తిరువూరు న్యూస్,మే. 23**
తిరువూరు నియోజకవర్గంలో తిరువూరు నగర పంచాయతీ తంగేళ్ల బీడులో ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన కామన్ సైట్లో తిరువూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కొందరు ప్రజలకు చెందవలసిన







భూమిలో గుడి అక్రమ నిర్మాణం చేస్తూ ఉన్నారు. ఇది నేపథ్యంలోనే తిరువూరు తాసిల్దార్ కు,రెవెన్యూ డివిజనల్ అధికారికి కలెక్టర్ వారికి ఫిర్యాదు చేయగా పై ఉన్నత అధికారులకు తప్పుడు నివేదిక అందించిన క్రింది అధికారులపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా గంపలగూడెం మండలం కనమూరు రెవెన్యూలో గంపలగూడెం మండల తాసిల్దార్ కబ్జాదారులకు సహకరిస్తూ నిజమైన దళిత భూ మహిళా బాధితురాలుని పెడుతున్న ఇబ్బందులపై,పై ఉన్నత అధికారులను కూడా మోసం చేస్తూ భూమిని స్వాధీనం చేసుకున్నానని మోసం మాటలతో అధికారులను మభ్యపెడుతున్న విషయంపై తిరువూరు నియోజవర్గంలో పలు సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉద్దేశ్యంతోనే త్వరలో తిరువూరు నడిగడ్డపై గతంలో ఎన్నో ఉద్యమాలు చేశానని మరల ఈరోజు ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం ప్రజా ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజల పక్షాన పని చేయకుండా అక్రమదారులకు,కబ్జాదారులకు పనిచేస్తునటువంటి లోకల్ అధికారుల పై నిరసన దీక్ష చేయుటకు సిద్ధంగా ఉన్నానని తిరువూరు నియోజకవర్గంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలు ప్రతిపక్ష పార్టీ నాయకులు,తోటి సామాజికవేత్తలు,సంఘీభావం తెలుపుటకు సిద్ధంగా ఉండాలని ప్రజాపక్ష నేత మెహర్ బాబా పిలుపునిచ్చారు.

## విహార యాత్రలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి జిల్లా ఎస్పీ.



**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**
వేసవి సెలవుల్లో విహార యాత్రలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. సొంత గ్రామాలకు లేదా ప్రయాణాలకు వెళ్లేటప్పుడు ఇళ్లలో విలువైన ఆభరణాలు, నగదు ఉంచరాదని తెలిపారు. వెళ్లే విషయాన్ని పక్కింటివారికి తెలియజేయాలని, ఇంట్లో లైట్లు వెలిగించి ఉంచాలని సూచించారు. అలాగే వాహనాలకు తాళాలు వేసి, పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

# పెద్ది నుంచి హెల్లల్లల్లో.. సాంగ్ ప్రోమో విడుదల




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక జరగనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం 'హెల్లల్లలో' అనే పాటకి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్, శృతి హాసన్ స్టెప్పులకి ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చాయి. ఫుల్ సాంగ్ మార్చి 23న రానుంది. ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. ఆయన సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పాటలో ఇంకో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయం మాత్రం చిత్రబృందం ఇంకా రహస్యంగానే ఉంచింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం ఇప్పుడు ప్రత్యేక గీతం వార్తతో మరింత చర్చనీయాంశంగా మారింది.

# ఎప్పుడూ అదే పక్షపాత ధోరణి

కథానాయకులు ప్రధాన పాత్రలు పోషించే చిత్రాలకు లభించే బడ్జెట్‌లు, మద్దతు లాంటివి నాయికా ప్రాధాన్య ప్రాజెక్టులకు దొరకవంటోంది బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవంలో పాల్గొన్నారామె. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో చిత్రపరిశ్రమ గురించి మాట్లాడారు. "మనది చాలా వైవిధ్యమైన దేశం. మనదైన శైలిలో మహిళా ప్రాధాన్య కథలను రూపొందించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి రీమేక్‌లు చేయకుండా.. ఒరిజినల్ కంటెంట్‌ను రూపొందించాలి. మన పురాణాలు, సంస్కృతులపై కూడా దృష్టిపెడతారని ఆశిస్తున్నా. హీరోలకు లభించే బడ్జెట్‌లు మాకు లభించవు. మహిళా చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద ఒక నిర్దిష్ట సామర్థ్యం మాత్రమే ఉంటుందనే పక్షపాత ధోరణి ఇండస్ట్రీలో ఎప్పుడూ ఉంటుంది. ఈ రోజుల్లో కూడా అలా ఉంటుందా అంటే బహుశా దాని గురించి ఎవరూ అంతగా మాట్లాడకపోయి ఉండొచ్చు. అంతేకానీ, లేదని మాత్రం కాదు. ప్రస్తుతం నేను కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాను. ఇది నిరంతరం ఎదుర్కోవాల్సినదే. దానిని అధిగమించడానికి ఏకైక మార్గం ముందుకు సాగిపోతూ పని చేస్తూ ఉండడమే. నేను మాత్రమే కాదు నా తోటి నటీమణులు చాలా మంది.. తమ కెరీర్‌లో తమ కోసమే కాకుండా భవిష్యత్తులో తమ తర్వాత వచ్చే అనేక మంది కోసం వాస్తవ పరిస్థితిని మార్చడానికి నిరంతరం కృషి చేస్తూ ఆ పరిమితులను దాటుతున్నారనే భావిస్తున్నాన"ని అన్నారు. హ్యూమా ప్రస్తుతం యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంలో నటిస్తోంది.



# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్




సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరఫున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి.దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.




# ఓటిటిలోకి మోహన్ లాల్, మమ్ముట్టిల పేట్రియాట్

మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన ఇద్దరు అగ్ర కథానాయకులు మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి నటించిన భారీ మల్టీస్టారర్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'పేట్రియాట్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో పొలిటికల్ అండ్ స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే థియేటర్లలో విడుదలైన కొన్ని వారాలకే ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ జీ5 ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా.. జూన్ 5 నుంచి ఈ సినిమాను డిజిటల్ ఎ÷–లాట్‌ఫారమ్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీ5 వెల్లడించింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం ఒకేసారి స్ట్రీమింగ్ కానుంది. మమ్ముట్టి, మోహన్‌లాల్ చాలా కాలం తర్వాత స్క్రీన్ షేర్ చేసుకోవడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా, ఇందులో ఫహాద్ ఫాజిల్ ప్రధాన విలన్ పాత్రలో నటించారు. నయనతార, కుంచాకో బోబన్, రేవతి వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. నేషనల్ సెక్యూరిటీ, ప్రభుత్వ నిఘా నెట్‌వర్క్ మరియు అంతర్జాతీయ కుట్రల చుట్టూ సాగే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను థియేటర్లలో మిస్ అయిన వారు జూన్ 5 నుండి జీ5లో వీక్షించవచ్చు.

# వినాయక చవితికి జైలర్-2 ?




'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

# సూర్య కరుప్పు.. రికార్డు కలెక్షన్లు




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న భారీ కంబ్యాక్ ఎట్టకేలకు నిజమైంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ బ్లాక్‌బస్టర్ కోసం ఎదురుచూస్తున్న సూర్యకు తాజాగా వచ్చిన 'కరుప్పు' చిత్రం ఆ లోటును పూర్తిగా తీర్చేసినట్టు కనిపిస్తోంది. తెలుగులో 'వీర భద్రుడు' పేరుతో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన మొదటి వారం ముగిసేలోపే ఈ సినిమా రికార్డు స్థాయి కలెక్షన్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణంగా పెద్ద సినిమాలు మొదటి వారంలో భారీ వసూళ్లు నమోదు చేయడం కొత్త విషయం కాదు. కానీ 'కరుప్పు' సాధించిన నంబర్లు మాత్రం ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ చిత్రం కేవలం ఏడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల మార్క్‌ను దాటేసి మొత్తం రూ.207 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దీంతో ఇది సూర్య కెరీర్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాల్లో అత్యంత వేగంగా భారీ వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సూర్య కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాలు వచ్చినా, ఈ స్థాయిలో భారీ ఓపెనింగ్స్‌తో పాటు స్థిరమైన వసూళ్లు రావడం అభిమానులను మరింత ఆనందంలో ముంచెత్తుతోంది. ముఖ్యంగా తమిళనాడులో సినిమా అద్భుతమైన రన్ కొనసాగిస్తుండగా, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, కేరళతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలో కూడా మంచి స్పందన లభిస్తోంది. వీకెండ్ తర్వాత కూడా వసూళ్లు బలంగా కొనసాగడం సినిమాకు ఉన్న బలమైన మౌత్ టాక్‌ను సూచిస్తోంది. ఇప్పుడు ట్రేడ్ విశ్లేషకుల దృష్టి మొత్తం సినిమా తదుపరి లక్ష్యంపై పడింది. ప్రస్తుతం 'కరుప్పు' రూ.300 కోట్ల గ్రాస్ మార్క్ వైపు దూసుకెళ్తోందని వారు అంచనా వేస్తున్నారు. ఇదే స్పీడ్ కొనసాగితే సూర్య కెరీర్‌లోనే కాదు, కోలీవుడ్‌లో కూడా మరో భారీ గ్రాసర్‌గా ఈ చిత్రం చరిత్ర సృష్టించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా, సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం అందించారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com